## క్లుప్తంగా

### తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): వేసవి ఎండలు తీవ్రరూపం దాలుస్తున్న పరిస్థితిలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం కొత్తగూడెం, పాల్వంచ మున్సిపల్, పబ్లిక్‌హెల్త్, మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్, గ్రిడ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిపాదనలో ఉన్న మంచినీటి పథకాలు, బోర్లు, పైప్‌లైన్లను తక్షణమే పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని, పనిచేయని బోర్లు, దెబ్బతిన్న పైప్‌లైన్లు, మంచినీటి ట్యాంకులకు మరమ్మతులు చేయాలని ఆదేశించారు. ఎక్కడ తాగునీటి సమస్య ఉన్నా అధికారులు స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, ఎన్ని నిధులైనా కేటాయించడానికి వెనుకాడేదిలేదని స్పష్టం చేశారు. సమీక్షలో మున్సిపల్ కమిషనర్ సుజాత, పబ్లిక్ హెల్త్ డీఈ శ్రీనివాస్, మిషన్ భగీరథ డీఈ సాయి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌డీఈ శివయ్య, మున్సిపల్ డీఈ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

### అన్నపురెడ్డిపల్లి ఇన్‌చార్జ్‌గా మంగీలాల్



మంగీలాల్‌నాయక్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

జూలూరుపాడు: మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మాళోత్ మంగీలాల్‌నాయక్‌ను జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమానికి అన్నపురెడ్డిపల్లి మండల ఇన్‌చార్జ్‌గా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పొదెం వీరయ్య నియమించారు. కార్యక్రమంలో లేళ్ల వెంకటరెడ్డి, కొర్సా రమేశ్, ఉసికల వెంకటేశ్వర్లు, మల్కం వీరభద్రం, తాటి అరుణ్‌కుమార్, చింతా జగన్నాథం, బానోత్ జగన్, బానోత్ హత్తిరామ్, తోట శ్రీను, బాబూలాల్, తాటి రోహిణి పాల్గొన్నారు.

### తాగునీటి సమస్య పరిష్కరించాలని వినతి

పాల్వంచరూరల్: గ్రామానికి తాగునీరు సరఫరా చేసే మోటారు చెడిపోయి రెండు నెలలు గడుస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో తాము ఇబ్బంది పడుతున్నామని మండలంలోని నారాయణరావుపేట వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సమస్య పరిష్కారానికి పాటుపడాలని కోరుతూ మంగళవారం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు వినతిపత్రం ఇవ్వగా వారంలోగా కొత్త మోటార్ ఏర్పాటు చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మహేశ్వరికి సూచించారు. గ్రామస్తులు గంగుల వెంకటేశ్వరరెడ్డి, పర్స సురేందర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, మేక రాంబాబు, నవీన్ పాల్గొన్నారు.

### బీఆర్‌ఎస్ నాయకుల ఫిర్యాదు


టేకులపల్లి: ఎన్నికల సమయంలో ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని బీఆర్‌ఎస్ టేకులపల్లి మండల అధ్యక్షుడు బొమ్మెర వరప్రసాద్‌గౌడ్ ఆరోపించారు. మంగళవారం బీఆర్‌ఎస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కపై కేసు నమోదు చేయాలని పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ సురేశ్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఆమెడ రేణుక, చీమల సత్యనారాయణ, తేజావత్ రవి, బాణోతు కిషన్, శివ, కుమ్మరి కిరణ్, నాగభూషణం, ఫూల్‌సింగ్ పాల్గొన్నారు.

### ద్విచక్రవాహన ప్రమాదాలకు చెక్



సందును పూడుస్తున్న సిబ్బంది

ఇల్లెందు: పట్టణంలోని ప్రధాన రహదారి వెంట గల డివైడర్ కటింగ్‌ల వద్ద బైక్‌లకు జరుగుతున్న ప్రమాదాలకు చెక్ పడింది. డివైడర్ల నిర్మాణం సందర్భంగా ఆయా సెంటర్లలో బైక్‌లు దాటే ప్రదేశాలను పూడ్చేశారు. ముఖ్యంగా శివాలయం వద్ద శిల్పా ఎలక్ట్రానిక్ వద్ద, సీతారామా టాకీస్ వద్ద మూడు కటింగ్‌లు ఉన్నాయి. వీటన్నింటిని పూడ్చి వేశారు. పాదచారులు రోడ్డు దాటేలా వాహనాలకు చెక్ పడేలా చేశారు.



మూసివేసిన దృశ్యం

# షాక్ కొట్టకముందే..

- ట్రాన్స్‌ఫార్మర్లకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని వేడుకోలు
- రక్షణ చర్యలు లేక పొంచి ఉన్న ప్రమాదాలు
- ఎప్పుడేం జరుగుతుందోనని జనం బెంబేలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఫెన్సింగ్ లేని ట్రాన్స్‌ఫార్మర్లతో ప్రమాదం పొంచి ఉంది. రహదారుల పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు ఫెన్సింగ్ లేకపోవడంతో పొరపాటున తాకితే విద్యుదాఘాతంతో ప్రాణనష్టం జరిగే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్నిచోట్ల ఇళ్లపక్కనే ఫెన్సింగ్ లేకుండా ట్రాన్స్‌ఫార్మర్లు ఉండడం వల్ల చిన్నపిల్లలు ఆడుకుంటూ వెళ్లి వాటిని తగిలితే ఎదురయ్యే ప్రమాదం ఊహించడానికే కష్టంగా ఉంటుంది. అదేవిధంగా ఇంట్లో పెంచుకునే ఆవులు, గేదెలు, మేకలు ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ పెరిగే చెట్లు, పాకే మొక్కల తీగలను తినడానికి వెళ్లి ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ తీగలకు తగిలినా వాటికి కూడా ప్రాణనష్టం సంభవించే ప్రమాదాలు మెండుగా ఉన్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ అంటేనే ఆ ప్రాంతానికి మొత్తం విద్యుత్ సరఫరా చేసే విద్యుత్ లోడుతో ఉంటుంది. విద్యుత్ సరఫరా అధికంగా ఉంటుంది. ప్రధానంగా ఎక్కువగా ప్రజలు రాకపోకలు జరిపే ప్రాంతంలో విద్యుత్ అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకుని ప్రతి ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రధాన రహదారుల పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు కూడా ఫెన్సింగ్ లేని పరిస్థితులు ఉన్నాయి. రోడ్డు ప్రమాదాలు జరిగే సందర్భంలో పొరపాటున ప్రయాణికులతో ఉన్న వాహనాలు లేదా కుటుంబాలు ప్రయాణించే కార్లు ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్‌ను తగిలితే ప్రాణనష్టం ఎక్కువగా జరిగే ప్రమాదం ఉంది. పాఠశాలల పక్కన ఫెన్సింగ్ లేని ట్రాన్స్‌ఫార్మర్లు మరింత ప్రమాదకరంగా ఉన్నాయి. పాఠశాల విద్యార్థులు సైతం పొరపాటున ఫెన్సింగ్ లేకుండా ఓపెన్‌గా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకితే విద్యుదాఘాతానికి గురయ్యే అవకాశం ఉంది. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు ఫెన్సింగ్ లేని ట్రాన్స్‌ఫార్మర్లకు ఫెన్సింగ్‌లు వేసి ప్రమాదాలు జరుగకుండా కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.



పట్టణంలోని సూర్యప్యాలెస్ పక్కన ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

### భయంభయంగా గడుపుతున్నాం..



మా ఇంటి పక్కనే ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. ఇంట్లో చిన్న పిల్లలు ఎక్కడ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళతారో అని భయపడుతూ కంటికి రెప్పలా కాపాడుకుంటున్నాం. ఇంటి గేట్ ఎప్పుడూ వేసి ఉంచాల్సి వస్తోంది. ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి.

–జి.నాగేశ్వరరావు, పంజాబుగడ్డ, రామవరం

### ఫెన్సింగ్‌తోనే ప్రమాదాలకు చెక్



ట్రాన్స్‌ఫార్మర్లకు ఫెన్సింగ్‌లు వేసి ప్రమాదాలు జరగకుండా చూడాలి. మనుషులకే కాకుండా పశువులకు కూడా ప్రాణనష్టం జరిగే అవకాశం ఉంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఎలాంటి దుర్ఘటనలు జరుగకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి.

–మిట్టపల్లి సునీత, పాతకొత్తగూడెం

### ప్రతిపాదనలు పంపించాం..



ట్రాన్స్‌ఫార్మర్లకు ఫెన్సింగ్ లేక ఇబ్బందులు ఎదురవుతున్నట్లు దృష్టికి వచ్చింది. ఫెన్సింగ్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. ఈ నెల చివరి వరకు మంజూరు లభించే అవకాశం ఉంది. నిధులు మంజూరు అయిన వెంటనే ట్రాన్స్‌ఫార్మర్లకు ఫెన్సింగ్ నిర్మాణాలను ప్రారంభిస్తాం.

–పి.హేమచంద్రబాబు, విద్యుత్ ఏడీఈ

# దాసుతండాలో బీటీ రోడ్డు నిర్మాణం



దాసుతండాలో బీటీ రోడ్డు వేస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

టేకులపల్లి: మండలంలోని దాసుతండా ప్రజలకు దుమ్ము, ధూళి కష్టాలు తీరనున్నాయి. ఈ గ్రామం మీదుగా కోయగూడెం ఓపెన్ కాస్ట్‌కు వచ్చివెళ్లే వాహనాలతో దుమ్ము ఎగిసిపడుతుండగా స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. అయితే, టేకులపల్లి సెంటర్ నుంచి దాసుతండా వరకు కి.మీ. మేర రహదారి విస్తరించి డివైడర్ నిర్మిస్తూ సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు పనులను గత ఎమ్మెల్యే హరిప్రియ ప్రారంభించారు. సెంటర్ నుంచి రేగులతండా వరకు 300 మీటర్ల మేర పనులు పూర్తి కాగా, మిగతా చోట్ల ఇరువైపులా తవ్వి మిక్సింగ్ వేశారు. అంతలోనే ప్రభుత్వం మారడంతో పనులు నిలిచిపోయాయి. ఈ నేపథ్యాన స్థానికులు ఇబ్బంది పడుతూ తరచుగా ఆందోళన చేస్తుండగా గత నెల 25న టేకులపల్లికి వచ్చిన కలెక్టర్ జితేశ్ వి పాటిల్ వాహనాన్ని ఆపి రోడ్డు దుస్థితిని వివరించారు. అంతేకాక గత నెల 27న ‘సాక్షి’లో ‘దుమ్ము, ధూళితో చస్తున్నాం..’ శీర్షికన ప్రచురితమైన కథనంతో అధికారులు స్పందించారు. ఈమేరకు మంగళవారం బీటీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించడంతో ప్రజల ఇక్కట్లు తీరనున్నాయి.

# ఇల్లెందులో 61 శాతం బొగ్గు ఉత్పత్తి



వివరాలు వెల్లడిస్తున్న ఏరియా జీఎం వి.కృష్ణయ్య

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియాలో మార్చిలో 61 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు ఏరియా జీఎం వి.కృష్ణయ్య వెల్లడించారు. మంగళవారం జీఎం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 2025 మార్చిలో ఇల్లెందు ఏరియా బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 5.45 లక్షల టన్నులు కాగా 3.33 లక్షల టన్నులు (61 శాతం) ఉత్పత్తి చేశామని వెల్లడించారు. రైలుమార్గం ద్వారా 1.74 లక్షల టన్నులు, రోడ్డు మార్గం ద్వారా 0.75 లక్షల టన్నులు, ఆర్‌సీహెచ్‌పీ ద్వారా 1.10 లక్షల టన్నులు మొత్తం 3.58 లక్షల టన్నులు బట్వాడా చేశామని తెలిపారు. 45 రేకుల ద్వారా బొగ్గు సరఫరా చేశామన్నారు. ఇల్లెందు ఏరియాకు కేటాయించిన వార్షిక బొగ్గు లక్ష్యం 41.30 లక్షల టన్నులు కాగా 42.75 లక్షల టన్నులు ఉత్పత్తి చేసి 104 శాతం సాధించామని పేర్కొన్నారు.

**వచ్చే నెలలో పూసపల్లి ఓసీ అనుమతులు..**

ఇల్లెందులో బొగ్గు ఉత్పత్తి అడుగంటిన వేళ పూసపల్లి ఓసీ అనుమతులు మేలో వస్తాయని ఏరియా జీఎం వి.కృష్ణయ్య తెలిపారు. కొత్తగూడెంలో ఒక గనికి అనుమతులు లభించాయని, ఇల్లెందు పూసపల్లి ఓసీకి కూడా త్వరలో అనుమతులు వస్తాయన్నారు. జేకే–5 ఓసీలో బొగ్గు లభించినంత కాలం సేకరిస్తామని వివరించారు. సమావేశంలో సింగరేణి అధికారులు జీవీ మోహన్‌రావు, గిరిధర్ రావు, సాయి స్వరూప్ తదితరులు ఉన్నారు.

# విద్యార్థి సంఘాల నాయకులు అరెస్ట్

ఇల్లెందు: హెచ్‌సీయూలో ఆందోళనల నేపథ్యంలో పోలీసులు విద్యార్థి సంఘాల నేతలను ముందస్తుగా అరెస్టు చేశారు. ఇల్లెందులో పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు కాంపాటి పృథ్వీ, పీడీఎస్‌యూ చంద్రన్న వర్గం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.సాంబ, పీడీఎస్‌యూ పట్టణ అధ్యక్షులు సాయి, అబ్దుల్ ఘనీతో పాటు బీఆర్‌ఎస్‌వీ బాధ్యులు గిన్నారపు రాజేశ్, సాతల్ల హరికృష్ణ, చాంద్ పాషాను పోలీసులు ఇంటి నుంచి పోలీస్ స్టేషన్‌కు తరలించి అరెస్టు చేసినట్లు ప్రకటించారు. రాత్రికి రాత్రే తమను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు కె.పృథ్వీ తెలిపారు.

**పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడి అరెస్టు**

ఇల్లెందురూరల్: హెచ్‌సీయూలో ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాడాన్ని నిరసిస్తూ యూనివర్సిటీ విద్యార్థులు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా పలు విద్యార్థి సంఘాలు ఆందోళనకు మద్దతు తెలిపాయి. పోలీసులు అరెస్టులో భాగంగా మండలంలోని కొమరారంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు భూక్య శ్యామ్‌ను అదుపులోకి తీసుకున్నారు.

**బీఆర్‌ఎస్‌వీ నాయకులు..**

పాల్వంచ: పాల్వంచకు చెందిన బీఆర్‌ఎస్‌వీ నాయకులను పోలీసులు మంగళవారం తెల్లవారుజామున అరెస్ట్ చేశారు. వారిలో బీఆర్‌ఎస్‌వీ నియోజక వర్గ అధ్యక్షులు బత్తుల మధుచంద్, పట్టణ అధ్యక్షులు జూపల్లి దుర్గాప్రసాద్ ఉన్నారు.



ఇల్లెందు: పోలీస్ స్టేషన్‌లో పీడీఎస్‌యూ నేతలు

**అక్రమ నిర్బంధం హేయం**

టేకులపల్లి: కారణాలు చెప్పకుండా విద్యార్థి సంఘాల నాయకులను అక్రమంగా నిర్బంధించడం హేయమైన చర్య అని పీడీఎస్‌యూ జిల్లా నాయకుడు బి.అరుణ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముందస్తు అరెస్టులను ప్రజాస్వామికవాదులు ఖండించాలని కోరారు.

# పాఠశాలకు రూ.20 వేల విరాళం

సూపర్‌బజార్(కొత్తగూడెం): సామాజిక బాధ్యతలోనూ విద్యుత్ ఉద్యోగులు ముందున్నారని విద్యుత్ ఎస్‌ఈ మహేందర్ తెలిపారు. ఆయన మంగళవారం మాట్లాడారు. ఉద్యోగులు ప్రతి నెల తమ జీతంలో నుంచి పాల్వంచలో నిర్వహిస్తున్న శాంతి వెల్ఫేర్ అసోసియేషన్ (దివ్యాంగుల పాఠశాల)కు రూ.20 వేలు అందిస్తున్నామని తెలిపారు. ప్రతినెలా ఈ విరాళాన్ని వారి ఖాతాకు నేరుగా జమ చేస్తున్నామని చెప్పారు. భవిష్యత్‌లోనూ సామాజిక కార్యక్రమాలు కొనసాగిస్తామని పేర్కొన్నారు.



విరాళం అందిస్తున్న విద్యుత్ ఎస్‌ఈ

### అడవిలో మంటలు..



బద్దుతండా జీపీ మద్దిరాలతండా గుట్ట వెనకాల కాలిపోతున్న చెట్లు

టేకులపల్లి: ఎండలు మండుతున్నాయి. మండలంలోని బద్దుతండా పంచాయతీ మద్దిరాల తండా గుట్ట వెనకాల మంగళవారం అడవిలో మంటలు చెలరేగాయి. చెట్లు మంటల్లో కాలుతున్న దృశ్యాలు కనిపించాయి.

### వేలాన్ని ఆపాలి

జూలూరుపాడు: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల అక్రమ వేలాన్ని తక్షణమే ఆపాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ సభ్యుడు పెరుమాళ్ల పవన్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన జూలూరుపాడులో మాట్లాడారు. సెంట్రల్ యూనివర్సిటీ భూములను అమ్మకానికి పెడితే సహించేది లేదన్నారు. విద్యార్థులపై పోలీసులు దాడులు చేయడం సరైన విధానం కాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీరామ్, కృష్ణ, అనిల్, గణేశ్, ప్రసాద్, అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

### చలివేంద్రాలు ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లెందు: పట్టణంలోని జగదాంబాసెంటర్‌లో చలివేంద్రాన్ని ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రారంభించారు. మంగళవారం ఆర్యవైశ్య మండల అధ్యక్షులు ప్రొద్దుటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ప్రజలు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భవిష్యత్‌లోనూ సామాజిక కార్యక్రమాలు కొనసాగిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అనుబాబు, చంద్రశేఖర్, కండె రమేశ్, చందా భద్రం, సుబ్బారావు, నాగేశ్వరరావు, రవికిరణ్, సత్యేంద్రర్, నాగరాజు, ఉపేంద్రనాథ్, నరేందర్ పాల్గొన్నారు.

**పాల్వంచ బస్టాండ్‌లో..**



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

పాల్వంచ: స్థానిక బస్టాండ్‌లో శ్రీ సద్గురు ఫౌండేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ జి.వీరభద్రం ప్రారంభించి మాట్లాడుతూ.. ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రేఖ అప్పారావు, వంగా వెంకన్న, వీరబోయిన వెంకన్న, గుమ్మడి వెంకన్న, రాంబాయి, విద్య, లాలమ్మ, రాణెమ్మ, అన్నపూర్ణమ్మ, అచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ‘సన్న బియ్యం’ కీలకం..



చుంచుపల్లి: సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



పాల్వంచరూరల్: సన్నబియ్యాన్ని లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్న కొత్వాల శ్రీనివాసరావు

కొత్తగూడెంఅర్బన్/చుంచుపల్లి/సుజాతనగర్/జూలూరుపాడు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో సన్న బియ్యం పంపిణీ కీలకంగా మారనుందని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం పట్టణంలోని 28వ వార్డు రామాటాకీస్ ఏరియా రేషన్ షాపులో సన్నబియ్యం పథకాన్ని కూనంనేని ప్రారంభించి మాట్లాడారు. ప్రజల ఆరోగ్యానికి, పోషకాహార భద్రతకు ఈ పథకం దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో సాబీర్‌పాషా, నాగా సీతారాములు, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి రుక్మిణీదేవి, డీఎం త్రినాథ్, తహసీల్దార్లు పుల్లయ్య, కృష్ణ, శిరీష, డీటీ మహేశ్ పాల్గొన్నారు. అలాగే, చుంచుపల్లి: అలాగే, చుంచుపల్లి మండలం రాంనగర్ రేషన్‌షాపులో మంగళవారం సన్నబియ్యం పథకాన్ని కూనంనేని ప్రారంభించారు. తహసీల్దార్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు. అలాగే, సుజాతనగర్ మండలం నాయకులగూడెంలోనూ సన్నబియ్యం పథకాన్ని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రారంభించారు. జూలూరుపాడు మండలం పడమటనర్సాపురం, బేతాళపాడు గ్రామాల్లో సన్నబియ్యం పథకాన్ని కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు.

**జీవన ప్రమాణాలు మెరుగుపడాలి**

ఇల్లెందు/ఇల్లెందురూరల్: పేదల మీద ఆర్థిక భారం తగ్గించి వారి జీవన ప్రమాణాలు మెరుగుపర్చేందుకు ఇందిరమ్మ ప్రభుత్వం ఇంటింటికీ ఉచిత సన్న బియ్యం పథకం ప్రారంభించిందని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. మంగళవారం ఇల్లెందులపాడు 45వ షాపులో సన్నబియ్యాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో దానియేల్, మండల రాము, మడుగు సాంబమూర్తి, బోళ్ల సూర్యం, చిల్లా శ్రీనివాస్, ఎరసంగి వెంకన్న, మొగిలి లక్ష్మి తదితరులు ఉన్నారు. అలాగే, మండలంలోని బాలాజీనగర్‌లో మంగళవారం ఎమ్మెల్యే కోరం కనకయ్య సన్నబియ్యం పథకాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ ముత్తయ్య, కాంగ్రెస్ నాయకులు పులి సైదులు, పాయం స్వాతి, మండల రాముమహేశ్, సాంబమూర్తి, బోళ్ల సూర్యం, శ్రీను, ఆంజనేయులు పాల్గొన్నారు.

**పేద ప్రజలకు వరం**

పాల్వంచరూరల్: సన్నం బియ్యం పంపిణీ పేద ప్రజలకు వరమని మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పాండురంగాపురం గ్రామంలో మంగళవారం రేషన్ షాపులో ఉచిత సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సివిల్ సప్లై డీటీ సుంకర శ్రీనివాసరావు, రూరల్ ఆర్‌ఐ నళినీకుమార్‌తోపాటు యర్రంశెట్టి ముత్తయ్య, కొండం వెంకన్న, ఆడెపు చిన్నవెంకట్రామయ్య, జగదీశ్, సామా వెంకట్‌రెడ్డి, ఎస్‌వీఆర్‌కే ఆచార్యులు, బానోతు లీల, భావ్‌సింగ్ పాల్గొన్నారు.

# రైతు కుటుంబానికి పరామర్శ



రైతు కుటుంబంతో మాట్లాడుతున్న డీఏఓ బాబూరావు

జూలూరుపాడు: మండలంలోని వినోభానగర్ గ్రామానికి చెందిన జర్పుల కృష్ణ తన పొలంలో పండించిన మొక్కజొన్న కంకులు తిని ఇటీవల మృతి చెందాడు. మంగళవారం బాధిత రైతు కుటుంబాన్ని డీఏఓ డీఏఓ వేల్పుల బాబూరావు, జూలూరుపాడు ఏఓ గడ్డం దీపక్‌ఆనంద్ పరామర్శించారు. కృష్ణ మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. మొక్కజొన్న కంకులను వారంపాటు తినడం వల్ల కృష్ణ ఆరోగ్య పరిస్థితి క్షీణించిందని కుటుంబ సభ్యులు వివరించారు. దీంతో డీఏఓ బాబూరావు మాట్లాడుతూ.. మొక్కజొన్న కంకులు తినడం వల్ల మృతి చెందే అవకాశం ఉండదని, ఇతర అనారోగ్య కారణాలు ఏమైనా ఉన్నాయా అని అడిగారు. విత్తన కంపెనీ ప్రతినిధులతో డీఏఓ ఫోన్ ద్వారా మాట్లాడారు. బాధిత రైతు కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని సూచించారు. మొక్కజొన్న కంకులు తినడం వల్ల ఎలాంటి ప్రాణహాని ఉండదని, పత్తిలో మాదిరిగా మొక్కజొన్నలో బీటీ ఉండదని చెప్పారు. డీఏఓతోపాటు ఖమ్మం జిల్లా రైతు సమన్వయ సమితి చైర్మన్ నల్లమల వెంకటేశ్వరరావు, ఏఈఓ విజయభాను పాల్గొన్నారు.

# కేఓసీలో మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ



టేకులపల్లి: మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

టేకులపల్లి: రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో ఓపెన్ కాస్టుల్లో కార్మికులు విధులతో సతమతమవుతున్నారు. ఈ నేపథ్యంలోనే కార్మికులు, ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణకు సింగరేణి యాజమాన్యం మంగళవారం జేకేఓసీతో పాటు టేకులపల్లి మండలంలోని కోయగూడెం ఓపెన్‌కాస్టులో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులకు ఉచితంగా మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేసింది. యాక్టింగ్ మేనేజర్ బ్రహ్మం, వెల్ఫేర్ ఆఫీసర్ వరిపెల్లి అజయ్ మాట్లాడుతూ.. రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని సింగరేణి ఉద్యోగుల దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ ప్యాకెట్లను అందజేస్తున్నామన్నారు. ఉద్యోగులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వారు తెలిపారు.

**జేకే–5 ఓసీలో..**

ఇల్లెందు: సింగరేణి జేకే–5 ఓసీలో కార్మికులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. మంగళవారం ఓసీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జీఎం వి.కృష్ణయ్య, మేనేజర్ పులి పూర్ణచందర్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ అజయ్ చేతుల మీదుగా మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు. ప్రాజెక్టు ఇంజనీర్ చిన్నయ్య, సేఫ్టీ ఆఫీసర్ శివప్రసాద్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సుధాకర్, రవి, శ్రీకాంత్, శ్రీనివాసరెడ్డి, చిక్క శ్రీనివాస్, సామల శ్రీనివాస్, భూక్యా నాగేశ్వరరావు, బాబూరావు, బండి రాము పాల్గొన్నారు.

# అన్ని వర్గాలకు సముచిత స్థానం



సీఎండీని సన్మానిస్తున్న నాయకులు

కొత్తగూడెంఅర్బన్: సింగరేణిలో అన్ని వర్గాల ఉద్యోగులకు సముచిత స్థానం కల్పించడంలో సీఎండీ బలరాం ముందు వరుసలో ఉన్నారని సింగరేణి మాదిగ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు బొంకూరి మోహన్ తెలిపారు. మంగళవారం అసోసియేషన్ సభ్యులంతా సీఎండీని కలిసి సన్మానించి మాట్లాడారు. సింగరేణి 136 ఏళ్ల చరిత్రలో తొలిసారిగా దళితవ్యక్తికి సింగరేణి వైద్య శాఖ మండలిలో ముఖ్య పరిపాలన అధికారిగా (సీఎంఓ)గా పదోన్నతి కల్పించడం హర్షణీయమన్నారు. సీనియార్టీని పరిగణనలోకి తీసుకొని కిరణ్‌రాజ్‌కుమార్‌ను సీఎంఓగా ఎంపిక చేయడం పారదర్శకతకు నిదర్శనమని పేర్కొన్నారు. కురి రాజేశ్వరరావు, చొప్పదండి దుర్గప్రసాద్, చంద్రమౌళి, మధుకృష్ణ పాల్గొన్నారు.

# యూనిఫైడ్ పెన్షన్ స్కీంపై నిరసన




నల్ల బ్యాడ్జీలతో నిసరన తెలుపుతున్న ఉద్యోగులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు అమల్లోకి వస్తున్న యూనిఫైడ్ పెన్షన్ స్కీంను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా సీపీఎస్ సంఘాల పిలుపు మేరకు టీజీఈ జేఏసీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సింగరేణి మహిళా డిగ్రీ కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ స్పాట్ వాల్యుయేషన్ ఉద్యోగులతో మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. తరువాత బస్టాండ్ సెంటర్‌లోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ అమరనేని రామారావు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి అమలు చేస్తున్న యూపీఎస్ విధానం ఎట్టి పరిస్థితుల్లో తెలంగాణ రాష్ట్రం అడాప్ట్ చేసుకోవద్దని డిమాండ్ చేశారు.